# సామాజిక కోణంలో ఆంధ్రుల చరిత్ర!

**ఆంధ్రుల సామాజిక చరిత్ర**
- ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల తొలి ప్రస్తావన
- మెగస్తనీస్ గ్రీకు రాయబారి
- ఆంధ్రుల గురించి పేర్కొన్న తొలి శాసనం – అశోకుడి 13వ శాసనం

**ఏపీపీఎస్‌సీ గ్రూప్-2 కొత్త సిలబస్‌లో 'ఆంధ్రుల సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల చరిత్ర'ను ప్రత్యేక అంశంగా చేర్చారు. ఒకప్పుడు చరిత్ర అంటే రాజుల, రాణుల ప్రేమ పురాణాలు, యుద్ధాలు, కట్టడాలు-కోటలు మాత్రమే అనే అభిప్రాయం ఉండేది. కొత్త సిలబస్‌లో రాజకీయ అంశాలకు ప్రాధాన్యం తగ్గించి, సామాజిక అంశాల ప్రాధాన్యాన్ని పెంచారు. దీనికి అనుగుణంగా ఆంధ్రుల చరిత్రలోని సామాజిక అంశాలను దృష్టిలో ఉంచుకొని చదవడం మంచిది.**

భారతదేశ చరిత్రలో అతి ప్రాచీన జాతి ఆంధ్రులు. భారతదేశ చరిత్ర రూపుదిద్దుకుంటున్న కాలంలో దక్షిణాదిన దండకారణ్యంలో ఆంధ్రులు నివసించేవారు. ప్రాచీన ఇతిహాసాలైన మహాభారతం, రామాయణం, బౌద్ధ, జైన గ్రంథాల్లో ఆంధ్రులకు సంబంధించిన ఎన్నో గాథలున్నాయి. కౌరవులు, పాండవుల కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రులు, కళింగులు కౌరవుల పక్షాన పోరాడారు. ధర్మరాజు రాజసూయ యాగం చేసినప్పుడు సహదేవుడు పాండ్య, ద్రవిడ, ఓండ్ర, కేరళ, ఆంధ్ర, కళింగ రాజ్యాలను జయించాడని చెబుతారు. హరివంశ పురాణం ప్రకారం శ్రీకృష్ణుడు మధురకు వచ్చినప్పుడు కంసుడి ద్వారా ప్రేరేపితుడై మల్లయుద్ధంలో చాణూరుడ్ని చంపాడు. ఈ చాణూరుడు ఆంధ్ర వంశానికి చెందినవాడనే వాదన ఉంది.

## మహాభారత యుద్ధం ప్రధాన ఘట్టం

ప్రాచీన చరిత్రలో మహాభారత యుద్ధం ఓ ప్రధాన ఘట్టం. దాయాదుల మధ్య జరిగిన ఈ పోరులో అనేక తెగలు పాల్గొన్నాయి. అప్పటి వరకు దేశం మొత్తాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించిన కౌరవ సామ్రాజ్యం ఈ యుద్ధంతో అంతమైంది. ఈ పరిణామం అనంతరం వందలాది చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. యమునా నదీతీరంలో మిడతల దండు, కరవు వంటి కారణాల వల్ల పంటలు నాశనమయ్యాయి. దీని ఫలితంగా ఈ ప్రాంత ప్రజలంతా దక్షిణాదికి తరలిపోయారని చాందోగ్య ఉపనిషత్తు తెలుపుతోంది. ఇలా వచ్చినవారే ఆంధ్రులయ్యారు.

రుగ్వేదానికి అనుబంధంగా ఉన్న ఐతరేయ బ్రాహ్మణం ఆంధ్రుల గురించి మొట్టమొదట ప్రస్తావించింది. విశ్వామిత్రుడు నరమేధయాగాన్ని నివారించి, శనశ్శేపుని విడిపించి అతడిని దత్తతగా స్వీకరించాడు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని విశ్వామిత్రుడి సంతతి తండ్రి శాపానికి గురై 'తెన్' దిక్కుకు తరలిపోయారు. 'తెన్' అంటే దక్షిణం అని అర్థం. అలా శాపానికి గురై దక్షిణాదికి వచ్చిన వారే విశ్వామిత్రుడి సంతతికి చెందినవారు. వీరినే పుండ్రులు, పుళిందులు, శబరులు, మూతిబలు, అభిరులు, యక్షులు, నాగులు, ఆంధ్రులు అంటారు. ఇవన్నీ ఆంధ్రదేశంలోని ప్రాచీన తెగలు.

## ఆంధ్రుల గురించి పేర్కొన్న మొదటి రచన

ఆంధ్రుల గురించి పేర్కొన్న మొదటి విదేశీ రచన 'ఇండికా'. దీన్ని మెగస్తనీస్ రచించాడు. ఇందులో ఆయన ఆంధ్రదేశాన్ని 'అంధేరి' అని పిలిచాడు. 'ఆంధ్రులు అత్యంత ప్రమాదకరమైన జాతి. వీరికి లక్ష కాల్బలం, 30 దుర్గాలున్నట్లు రాశాడు. మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి వచ్చిన గ్రీకు రాయబారి.

ఆంధ్రుల గురించి అశోకుడి 13వ శిలాశాసనంలో మొదటిసారి ప్రస్తావించారు. ఈ శాసనం ఒరిస్సాలోని జౌళి, జౌగాడ్‌లలో లభించింది. కృష్ణా-గోదావరి నదుల మధ్య ఆంధ్ర జాతి నివసిస్తుండేదని ఈ శాసనం పేర్కొంది. క్రీ.పూ. 261లో అశోకుడు చేసిన కళింగ యుద్ధం గురించి ఈ శాసనమే వివరించింది.

ఆంధ్రుల గురించి బౌద్ధ జాతక కథలు తెలుపుతున్నాయి. ఒరిస్సా నుంచి ఆంధ్రులు దండకారణ్యంలోకి ప్రవేశించేవారని జాతక కథలు వివరిస్తున్నాయి. సుత్తనిపాత అనే పాళీ భాషా బౌద్ధ గ్రంథం ఆంధ్ర దేశాన్ని 'మహాఅంధకదేశమని' పేర్కొంది. సమయసారమనే జైన ప్రాకృత గ్రంథం ప్రాచీన ఆంధ్రులు జైనులని పేర్కొంటుంది. గౌతమ బుద్ధుడు నాగార్జునసాగరానికి వచ్చి తపస్సు చేస్తుండగా నాగముచలిందుడు తన ఏడు పడగలతో రక్షణ కల్పించినట్లు బుద్ధకథలో రాసి వుంది. ఈ అంశానికి సంబంధించి పరీక్షలో నాగముచలిందుడు ఏ మతానికి చెందిన పాత్ర? అని అడిగారు. చాలామంది శైవమతానికి అని జవాబు రాశారు. కారణం, 'నాగం' అంటే సర్పం, శివుడి కంఠాభరణం కనుక శైవం అని గుర్తించారు. నాగులు, నాగముచలిందుడు బౌద్ధమతస్థులు. ఆంధ్రదేశంలోని మొట్టమొదటి చారిత్రాత్మక తెగ నాగులు. వీరు ప్రాచీన ఆంధ్రాకాలంలో గోదావరి ప్రాంతంలో నివశించేవారు. ఈ గోదావరి ప్రాంతాన్నే వజ్రదేశం, నాగభూమి, మంజీర దేశమని పిలిచేవారు.

## దీపాల దిన్నె

కళింగ దేశ రాజకుమార్తె, ఆమెభర్త కలసి బుద్ధుడి దంతం గల పెట్టెను సింహళం తీసుకునిపోతూ దారిలో సముద్ర మార్గం నుంచి కృష్ణానది ఎగువకు చేరుకున్నారు. వీరు వజ్రాల దిన్నె వద్ద బస చేశారు. దీనికి దీపాలదిన్నె అని మరో పేరుంది. ఇదే సమయంలో నాగజుకుడనే నాగ

రాజు అమరావతి బౌద్ధస్థూపాన్ని నిర్మిస్తున్నాడు. వజ్రాలదిన్నె లేదా దీపాలదిన్నె అంటే అమరావతి స్థూపం. నాగజాతి ప్రజలు నాగుపాము అధికార చిహ్నంగా భావించి బౌద్ధాన్ని పోషించారు. తమలో తాము కలహించుకుంటున్న నాగుల మధ్య బౌద్ధం శాంతిని అందించింది. 'అహింసో పరమో ధర్మః' అంటూ అహింసను బోధించిన బౌద్ధ మతం క్రమంగా నాగులను వ్యవసాయం వైపు మళ్ళించింది.

దండకారణ్యంలో ఉన్న నాగులు కొంతమంది ఉత్తర భారతదేశానికి వెళ్ళి శిశునాగులు అయ్యారని, ఈ వంశంలోని కాలశోకుడే రెండో బౌద్ధ సంగీతిని వైశాలిలో నిర్వహించాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాలలో ఉన్న నాగులు, శ్రీలంకలో ఉన్న నాగజాతి కూడా మన ఆంధ్రులే అన్నది ఒక కథనం.

## యక్షులు

ప్రాచీన ఆంధ్ర తెగల్లో నాగుల తర్వాత మరొక జాతి యక్షులు. యక్షులు కూడా నాగుల వలే బౌద్ధ మతస్థులు. యక్షులలో కుబేర నాగుడనే రాజు భట్టిప్రోలు పేటిక శాసనం వేశాడు. ఈ శాసనం భట్టిప్రోలు లేదా ప్రతిపాలపురంలోని బౌద్ధస్థూపం గురించి వివరిస్తోంది.

శబరులు మరో ప్రాచీన ఆంధ్రజాతి. శ్రీరాముడు సీతాసమేతంగా లక్ష్మణుడితో కలసి ఆంధ్ర దేశంలోని పంచవటిని దర్శించినపుడు గోదావరి నది ఒడ్డున శబరులు నివసించేవారు. శ్రీరాముని భక్తురాలిగా పేర్కొనే శబరి ఈ జాతికి చెందినదే.

ఆంధ్రులు అనేవారు ప్రాచీన ఆంధ్రజాతుల్లో మరొకటి – బ్రహ్మాండపురాణం ప్రకారం 'ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళం. ఈ శ్రీకాకుళం కృష్ణా జిల్లాలోని ఘంటసాల మండలంలో ఉంది. ఇక్కడ ఆంధ్ర మహావిష్ణువు అనే రాజు నిశ్శంభుదానవుడు అనే రాక్షసరాజుని ఓడించి శ్రీకాకుళాన్ని పాలించాడు. ఈ శ్రీకాకుళాన్ని 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు దర్శించాడని, ఇక్కడే అతను తెలుగులో ఆముక్తమాల్యద గ్రంథాన్ని ప్రారంభించినట్లు ఆధారాలున్నాయి. 'దేశభాషలందు తెలుగులెస్స' అనే గొప్ప సూక్తిని కృష్ణదేవరాయలు శ్రీకాకుళంలోనే అన్నారనేది మరో కథనం.